

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్‌పి


ప్రజాశక్తి -అనంతగిరి: అనంతగిరి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా గురువారం సందర్శించారు. పోలీస్‌లో రికార్డ్స్ తనిఖీ చేశారు. సాధారణ ఎన్నికలు సక్రమంగా జరగడంతో కృషి చేసిన స్థానిక ఎస్సై .రామును అభినందించారు. పర్యాటక ప్రాంతాల్లో పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది విదుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట అరకు సిఐ రుద్రశేఖర్ ఉన్నారు



మాట్లాడుతున్న ఎస్‌పి

అల్లూరి స్ఫూర్తితో సమస్యలపై పోరాటం


- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర - ఘనంగా అల్లూరి జయంతి



అరకులోయలో నివాళి అర్పిస్తున్న సురేంద్ర, నాయకులు

ప్రజాశక్తి -అరకులోయరూరల్: అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా అరకులోయ మండలంలో కేంద్రంలోని ఏపీ గురుకులం బాలురు జూనియర్ కళాశాలలో గురువారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శతోత్సవ సదస్సు ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు జి బుజ్జి బాబు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సదస్సును ఉద్దేశించి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ మాట్లాడుతూ, బిటిష్ పాలకులు చేస్తున్న ఆగడాలను అల్లూరి ఎండ గట్టి చైతన్యం కల్పించి, ఆదివాసీ ప్రజలతో తిరుగుబాటు చేశారన్నారు. రోడ్డు పనులు చేయించి బ్రిటీష్ వారు కూలీ డబ్బులు చెల్లించేవారు కాదని వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ఆదివాసులకు సంఘం ఏర్పాటు చేసి మన్య విప్లవం రగిలించారని కొనియాడారు. అడవిపై ఆదివాసులకే హక్కు ఉండాలని అల్లూరి సీతారామరాజు సాయుధ పోరాటం చేశారని అన్నారు. అల్లూరి విద్యార్థి దశ నుండే ఆదివాసి ప్రాంతంలో జరిగిన అన్యాయాల పై పోరాటం చేశారని గుర్తుచేశారు.చట్టాలకు రక్షణ లేకుండా పోతుందని చెప్పారు.భవిష్యత్తులో అల్లూరి స్ఫూర్తితో గిరిజన ప్రాంత అభివృద్ధి కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు అప్పలరాజు, రామారావు, బుజ్జి బాబు, ఆదివాసీ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు టి జోషి, ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షులు కార్తీక్, మండలం కార్యదర్శి ఐసు బాబు పాల్గొన్నారు.

చింతూరు:మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తితో ఆదివాసీల హక్కులు, అటవీ చట్టాల పరిరక్షణ పోరాటాలు చేయాలని ఏపి ఆదివాసీ గిరిజన సంఘం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. అల్లూరి 127వ జయంతి సందర్భంగా చింతూరు విఆర్‌పురం మండలాల్లో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అల్లూరికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల చట్టాలను నిర్వీర్యం చేస్తూ, నిరంకుశంగా ఆదివాసీలను అడవుల నుంచి దూరం చేసే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.



చింతూరులో...

కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్, పూనెం ప్రదీప్ కుమార్, బీరబోయిన దిలీప్ కుమార్, గొర్రె.వెంకటేశ్వర్లు, రమేష్, రాజు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని రేకపల్లి సిపిఎం కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్ళడానికి యువత ముందుకు రావాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చినబాబు, నాయకులు పంపు సత్తిబాబు, పులి సంతోష్ కుమార్, కృష్ణారెడ్డి, జ్యోతిబస్, సోడి మల్లయ్య, కుంజ కన్నయ్య, హజారత్, ప్రకాష్‌రావు, తాతబాబు పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని టేకులబోరు గ్రామంలో అల్లూరి విగ్రహానికి గిరిజన సంఘం నాయకులు పొడియం రామారావు పూల మాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు, తలగాని నాగరాజు, బుజ్జి బాబు, సత్యనారాయణ, నాచుపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో జిల్లా అభివృద్ధికి కృషి

-కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో, అందరి సహకారంతో జిల్లాను అభివృద్ధి చేద్దామని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అల్లూరి కీర్తి దశ దిశలా వ్యాపించిందని, ఆయన స్ఫూర్తితో అటువంటి మహనీయుని పేరుతో ఏర్పడిన జిల్లాలో పని చేయడం అదృష్టంగా భావించి ఇక్కడి గిరి ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. గిరి ప్రజలకు సేవలు అందించడం కోసం ఐటిడిఎలు ఏర్పాటు చేసారన్నారు. సమస్యలు, లోటుపాట్లు గుర్తించి ఆర్థిక, మానవ వనరుల లభ్యత మేరకు అందరి సహకారంతో అభివృద్ధి చేయాల్సిన ఉందని కలెక్టర్ వివరించారు. కేవలం 40 రోజుల యోగ శిక్షణ ద్వారా కొంతమంది పిల్లలు బెంగుళూర్ లో జరిగిన యోగా పోటీలలో పాల్గొని రెండవ స్థానం సాధించారన్నారు. ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ మాట్లాడుతూ, అల్లూరి జీవితంలో కీర్తి ప్రతిష్టలు ఎక్కువగా సాధించారని కొనియాడారు.మన్యం ప్రాంతం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.ఎంపి తనూజ రాణి మాట్లాడుతూ, పోరాటాల సాధనతోనే హక్కులు సాధించవచ్చని అల్లూరి నిరూపించారన్నారు. పాడేరు శాశన సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ, సాయుధ పోరాటంతోనే స్వాతంత్ర్యం సాధించవచ్చని నమ్మిన అల్లూరి సాయుధ పోరాటానికి సిద్ధమయ్యారని చెప్పారు. అరకు శాశనసభ్యులు రేగం మత్స్యలింగం మాట్లాడుతూ, మన్యం వాసుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందన్నారు.మాజీ శాసన సభ్యులు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, శక్తి, యుక్తితో అల్లూరి సీతారామరాజు సాయుధ పోరాటం చేసారని గుర్తు చేసారు. ముందుగా అల్లూరి సీతారామరాజు విగ్రహానికి అతిధులందరూ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం విద్యార్థులు చేసిన కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బి. పద్మావతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అరకులోయలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు

విద్యా సంస్థల బంద్ విజయవంతం

-పలుచోట్ల విద్యార్థులు భారీ ర్యాలీ- ఆదివాసీ గిరిజన సంఘం మద్దతు

ప్రజాశక్తి -పాడేరు : నీట్ పరీక్షను రద్దు చేయాలని గురువారం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా చేపట్టిన విద్యా సంస్థల బంద్ అల్లూరి సీతారామ రాజు జిల్లా పాడేరులో విజయవంతమైంది. దీంతో, పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు మూతపడ్డాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన్ కృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కే. రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు చిన్నారావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నీట్ పరీక్షలలో ఒక్కొక్క విద్యార్థి నుండి 30 లక్షల రూపాయలు వసూలు చేసి బహిరంగంగా చెప్తున్నా, కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలు నీట్ పరీక్షను రద్దు చేయాలని అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టాయని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏమాత్రం మాట్లాడటం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నీట్ పరీక్షను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయాలని తెలిపారు. నీట్ పరీక్షను నిర్వహించిన ఎన్‌టిఏ సంస్థను తక్షణమే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలన్నారు. వైద్యం, విద్యతో వ్యాపారం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి, బడుగు బలహీన వర్గాల విద్యార్థులతో చెలగాటం ఆడుతుందన్నారు. కేంద్రం స్పందించని పక్షంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు పి.రాజు, చిన్నాబాబు, మల్లేష్, సింహాద్రి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

అరకులోయ :అరకులోయలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు అరకులోయ ముఖద్వారం నుంచి టౌన్షిప్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని, నీట్ ఎగ్జామ్ ను రద్దు చేయాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, నీట్ పేపర్ లీక్ చేసి విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్న వారిపై ప్రభుత్వం ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కుంభకోణంను బయటికి తీయాలని, దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ ఎగ్జామ్‌లో ఒక్కొక్కరి వద్ద నుంచి 50 లక్షల రూపాయలు చొప్పున అవినీతికి, అక్రమాలకు పాల్పడ్డారని ఆయన విమర్శించారు.అవకతవకలకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ విషయంపై రాజీలేని పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. లేనిపక్షంలో విద్యార్థుల భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. హక్కులు చట్టాలు పరిరక్షణ కోసం అల్లూరి స్ఫూర్తితో ముందుకు సాగాలని, నిర్విరామ పోరాటాలు జరపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్, మండల కార్యదర్శి ఐసుబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు పొద్దు బాలదేవ్, కిండంగి రామారావు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పాడేరులో నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థినులు



మంత్రి కందుల దుర్గేష్‌కు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

సత్యసాయి మంచినీటి కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మంత్రి దుర్గేష్‌కు యూనియన్ నేతల వినతి

ప్రజాశక్తి-దేవీపట్నం

ఏజెన్సీలో తాగునీరు అందిస్తున్న సత్యనాయి తాగునీటి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ నాయకులు గురువారం రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కట్టుమూరి వీరబాబు మాట్లాడుతూ పద్నాలుగు నెలలుగా జీతాలు లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈఎస్ఐ, పిఎఫ్ లేని కారణంగా ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు తీవ్ర ఆర్థికభారం అవుతుందని పేర్కొన్నారు. ఈ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి మంత్రి దుర్గేష్ ఆర్‌డబ్ల్యుఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్సికి ఫోన్ చేసి మాట్లాడారు. ఈ సమస్య పరిష్కారం కాకుంటే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. అలాగే రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణను సైతం కలిసి సమస్యలను తెలియజేశారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా మీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రెటరీ ఉందుర్తి ఇసాక్, కట్టంగి మల్లేశ్వరరావు, జొన్నల సురేష్, కాల రామకృష్ణ, సత్యసాయి కార్మికులు పాల్గొన్నారు.



ఎంఎల్ఎస్ పాయింట్‌లో తనిఖీలు చేస్తున్న జెసి భావన వశిష్ట

ఎంఎల్ఎస్ పాయింట్‌లో జెసి తనిఖీలు

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు ఎంఎల్ఎస్ పాయింట్‌లో అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రాబోవు వరదలకు బియ్యం పంపిణీ నిమిత్తం ముందుగా స్టాక్‌ను మండల బఫర్ స్టాక్ గౌడౌన్‌లకు చేరవేయాలని జిసిసి అధికారులను ఆమె ఆదేశించారు. అన్ని రికార్డులను తనిఖీ చేశారు. నిర్వాహణ సక్రమంగా ఉండాలని, లేనిచో తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎకో టూరిజంలో అవినీతిపై పూర్తి విచారణ చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి మండలంలోని వనవిహారి, ఎకో టూరిజంలో జరిగిన అవినీతిపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మారేడుమిల్లిలో వన విహారి, ఏకో టూరిజం ప్రారంభించిన తరువాత పర్యాటకుల తాకిడి పెరిగి పెద్ద మొత్తంలో ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. ఇలా వచ్చిన ఆదాయంలో సుమారు రూ.90 లక్షల నిధులు దారి మళ్లినట్లు ఆరోపణలు వచ్చాయని పేర్కొన్నారు. అలాగే గుడిసె గ్రీన్ ల్యాండ్‌కు అనుమతులిచ్చి ఆకు మామిడికోట గ్రామంలో అటవీ శాఖ అధికారులు ఒక చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి పర్యాటకుల నుండి పెద్ద వాహనానికి రూ.300, ద్విచక్ర వాహనానికి రూ.200, పర్యాటకుల నుండి రూ.50 చొప్పున డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలా వసూలు చేసిన సొమ్మును గతంలో సిబిఈటి కమిటీ ఆధ్వర్యంలో మారేడుమిల్లి యూనియన్ బ్యాంకులో జమ చేసేవారని, ఈ డబ్బులు లెక్కల విషయంపై గిరిజనులు ప్రశ్నించగా కొట్లాట చోటుచేసుకొని మారేడుమిల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి తహశీల్దారు కోర్టులో విచారణ జరుగుతుందని తెలిపారు. ఇందులో సుమారు కోటి 40 లక్షల రూపాయలు దారిమళ్లినట్లు ఆరోపణలు రావడంతో 2023 అక్టోబర్‌లో అటవీ అధికారులు సీబీఈటిని రద్దు చేసినట్లు వెల్లడించారు. బ్యాంకు ఖాతాలో జమ చేసిన సొమ్మును కమిటీకి తెలియకుండా చైర్మన్, వైస్ చైర్మన్ డ్రా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. అడవి ప్రాంతంలో టేకు చెట్లు నరికివేత, మారుజాతి కలప అక్రమ రవాణా విచ్చల విడిగా జరిగిందని, ఉన్నత అధికారులు రంప అటవీశాఖలో జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపితే నిజానిజాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. సిసిఎఫ్ ఆమోదం లేకుండానే కోట్లాది రూపాయలు డ్రా చేసిన అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని, మారేడుమిల్లి పర్యాటక కేంద్రం ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆ ప్రాంత గిరిజన అభివృద్ధికి కేటాయించాలని, తక్షణమే స్థానిక ఆదివాసీలతో పర్యటక కమిటీలు ఏర్పాటు చేయాలని కిరణ్ డిమాండ్ చేశారు.

బలిమెల నీటి నిల్వలపై సమీక్షా సమావేశం

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్ర ఒరిస్సా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి నిల్వలపై ఇరు రాష్ట్ర అధికారులు గురువారం ఒడిస్సా మల్కనగిరి జిల్లా బలిమెల ఓపీహెచ్‌సి కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. బలిమేల జలాశయం నంచి 2023- 24 నీటి సంవత్సరానికి గాను ఏ రాష్ట్రాలు ఎంతెంత నీటిని వినియోగించుకున్నారో లెక్కలు తేల్చారు. దీని ప్రకారం ఈ ఏడాది జూన్‌లో ఒరిస్సా 7.9717 టీఎంసీలు నీటి, ఆంధ్ర 4.3439 టిఎంసిలు నీటిని వినియోగించుకున్నట్లు నిర్ధారణ చేశారు. దీని ప్రకారం ఒడిస్సా జూన్‌లో ఆంధ్ర కంటే 3.6278 టీఎంసీలు నీటిని వినియోగించుకున్నట్లు తేల్చారు. 2023- 24 నీటి సంవత్సరంలో 2023 జులై నుంచి 2024 జూన్ చివరనాటికి మొత్తం ఆంధ్ర తన వాటా 65.9756 టీఎంసీలు నీటిని, 2022-23 నీటి సంవత్సరంలో ఆంధ్ర వాటా అధికంగా 13.7578 టిఎంసీలు వినియోగించుకున్నట్లుగా, ఒడిస్సా తన వాటా 2023-24 నీటి సంవత్సరంలో 65,5728 టీఎంసీలు నీటిని వినియోగించుకున్నట్లు లెక్కలు తేల్చారు. దీని ప్రకారం 2023-24 నీటి సంవత్సరాం చివరి నాటికి ఆంధ్ర ఒడిస్సా కంటే 0.4028 టీఎంసీల నీటిని అధింగా వినియోగించుకున్నట్టు నిర్ధారించారు. ప్రస్తుతం బలిమెలాలో 10.7200 టీఎంసీలు, జోలాపుట్‌లో 3.1226 టిఎంసిలు కలిపి బలిమెల జలాశయంలో మొత్తం 138426 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నట్లు అధికారులు లెక్కలు తేల్చారు. ఇందులో ఆంధ్ర వాటాగా 6.5185 టీఎంసీలు కాగా ఒడిస్సా వాటా 7.3241 టీఎంసీలుగా నిర్ధారించి ఇరు రాష్ట్రాధికారులు పంపకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఒడిస్సా తరపున హైడ్రో పవర్ ప్రాజెక్టు జనరల్ మేనేజర్ ఎస్. శివప్రసాద్, యూనిట్ హెడ్ కృపా సింధు బిశ్వాల్ టెక్నికల్ వింగ్ హెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్లు దుర్గేష్ మోహార్ అసిస్టెంట్ మేనేజర్ ఓం.ప్రకాష్ నాయక్, రాకేష్, పనికిరాని పొట్టేరు ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ పితానిశెట్టి, చిత్రకొండ ఎర్త్ డాం ఏఈ. రమాకాంత్, సీలేరు కాంప్లెక్స్ ఎస్ఇ సివిల్ కేకేవి. ప్రశాంత్ కుమార్, ఇఇ ప్రభాకర్, డిఇఇ వెంకట మధు, ఏఈఈ అనుదీప్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆంధ్రా, ఒడిశా అధికారులు

పింగళి వెంకయ్యకు నివాళి

ప్రజాశక్తి- చింతూరు

జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య వర్ధంతి సందర్భంగా గురువారం జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో చైర్మన్ జమాల్ ఖాన్ పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలను వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఆనాడు బ్రిటిష్‌వారిపై పోరాటపటిమను కనబరుస్తూ త్రివర్ణ పతాకం ఎగిసిపడిందని తెలిపారు. కార్యక్రమంలో జెకెసి ట్రస్టు సభ్యులు ఎస్‌కే.షాజహాన్, రియాజ్, ఇంతియాజ్, శేఖర్, నూర్ చాచా, సమీర్, బాబు, నాదర్, అఖిల్, అజీజ్ పాల్గొన్నారు.



పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం నాయకులు

విద్యార్థులకు పుస్తకాలు, దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని రామవరం పంచాయతీ పరిధి అడివివెంకన్నగూడెం పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులను ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచ్‌లు పూనం సరోజిని, పులి సంతోష్ కుమార్ సిపిఎం నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయాలని సీజన్లో వచ్చే వ్యాధుల పట్ల ఎప్పటికప్పుడు హెల్త్ క్యాంపులు పెట్టించాలని సూచించారు. ఉపాధ్యాయుల కొరత ఉందని, సంబంధిత అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పూనం సత్యనారాయణ, పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, జి లక్ష్మణరావు, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కొయ్యూరు

మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో రాజేంద్రపాలెం పిహెచ్‌సి వైద్యాధికారి మనోజ్ఞ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులను పరీక్షించి రక్తహీనత లోపాన్ని పరిశీలించారు. జ్వరాలు రాకుండా తగు సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రశాంత్, భవాని, చెల్లమ్మ, లక్ష్మి, రాజశ్రీ, ఉపాధ్యాయులు డి.బాలమురళీకృష్ణ, డి,వేణుబాబు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యశాఖ సిబ్బంది

మొక్కలను పంపిణీ చేయాలి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : ఎన్ఆర్ఈజిఎస్ కింద మొక్కలు నాటే కార్యక్రమం వేగవంతం చేయాలని, నాణ్యమైన మొక్కలు సేకరించి రైతులకు పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుండి జిల్లాలోని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులు అన్ని మండలాల ఎంపిడిఓలు, ఎపిఎంలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, 2023-24 లో లక్ష్య సాధన, 2024-25 లో టార్గెట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఈ నెల పదవ తేదీలోగా మొక్కలు నాటడానికి అవసరమైన గోతులు తీయడం పూర్తి చేయాలని, 20వ తేదీలోగా మొక్కలు నాటడం పూర్తి చేయాలని సూచించారు. పనులు వేగవంతం కావాలని ఆదేశించారు. అదేవిధంగా మన నర్సరీలలో అందుబాటులో ఉన్న మొక్కలు, ఇతర ప్రాంతాల నుండి తేవలసిన మొక్కలపై ఆరా తీసారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మొక్క సైజు, నాణ్యత పరిశీలించాలని, అందుకు ఎంపిడిఓ ఆధ్వర్యంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు బృందంగా ఏర్పడి తనిఖీ చేయాలని ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుండి తీసుకు వచ్చిన మొక్కలలో ఎంత వరకు బతికేది చూడాలని, నాణ్యత లోపాలతో పంపించిన నర్సరీలను బ్లాక్ లిస్టు లో పెట్టాలని సూచించారు. ముఖ్యంగా జీడిమామిడి, సిల్వర్ ఓక్ మొక్కలకు డిమాండ్ ఉన్నందున, వాటిని వాటితో పాటు ఇతర పండ్ల మొక్కలను రైతుల అభీష్టం మేరకు సేకరించాలని ఆదేశించారు. కాఫీ పంటకు సంబంధించి ఎన్ఆర్ఈజిఎస్ కింద చేపట్టడానికి అవకాశం లేనందున కాఫీ మొక్కల పెంపకానికి కాఫీ బోర్డు, స్పైస్ బోర్డు అధికారులతో చర్చించి తగు నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఆపరేషన్ పరివర్తన కింద గంజాయి పంటకు బదులుగా ఇతర మొక్కల విస్తరణకు పోలీసు శాఖ ద్వారా మొక్కలు పంపిణీ చేయాలని ఆదేశించారు. రంపచోడవరం ఐటిడిఎ పరిధిలో 1.17 లక్షల మొక్కలు అవసరం కాగా హెచ్ఎన్‌టిసిలో 35 వేలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని మిగిలిన మొక్కలు కడియం నర్సరీల నుండి తెప్పిస్తామని రంపచోడవరం పిఓ సూరజ్ గనోరే కోరగా వాటి నాణ్యత పరిశీలించాలని, ఆయా నర్సరీలలో అందుబాటులో ఉన్న మొక్కలు చూసి ఆర్డర్ ఇవ్వాలని లేకుంటే సబ్ కాంట్రాక్టర్ ద్వారా నాణ్యత లేని మొక్కలు పంపే అవకాశముందని కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా పిడి విద్యాసాగర్, జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు ఎస్.బిఎస్ నంద్, రమేష్‌కుమార్‌రావు పాల్గొన్నారు.

జియో సిగ్నల్‌ను పునరుద్ధరించాలి


సెల్ టవర్ వద్ద నిరసన తెలుపుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:మండలంలోని బొండం పంచాయతీ జయంతివలస గ్రామంలో ఏర్పాటు చేసిన జియో టవర్ సుమారు వారం రోజులుగా సిగ్నల్ లేక మూగబోయిందని దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే యాజమాన్యం స్పందించాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు.గురువారం జియో టవర్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు బుజ్జిబాబు మాట్లాడుతూ, వారం రోజుల నుండి జియో సిగ్నల్ లేక స్కూల్ టీచర్స్, మిడ్ డే మీల్స్ సిబ్బంది ఫోటోలు అప్లోడ్ చేయడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి జోషి, బుజ్జి బాబు, గ్రామస్తులు ఎస్.గోపి, కె. హరి,కె శంకర్‌రావు ,గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి జయంతి


అనంతగిరిలో అల్లూరికి నివాళులర్పిస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామ రాజు 127వ జయంతి వేడుకలు ఐటిడిఏ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ ఐటిడిఏ కార్యాలయం ఆవరణలో ఉన్న అల్లూరి సీతారామ రాజు, గాం మల్లుదొర, విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఐటిడిఏ సమావేశ మందిరంలో అల్లూరి సీతా రామరాజు చిత్రపటానికి పూల మాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ సీతా రామరాజు ఆయుషు తక్కువైనా కీర్తి గొప్పదని అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి స్వాతంత్ర సాధనకు నాంది పలికిందన్నారు.ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి. ఎస్.ప్రభాకర్, ఎం.వేంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, ఇఇ డివిఆర్ ఎం.రాజు, ఐటిడిఏ పరిపాలనాధికారి ఎం. హేమలత, ప్రాజెక్టు ఉద్యాన వన అధికారి ఎన్.అశోక్, ఎఎఓ శ్రీనివాస కుమార్, గురుకులం ప్రిన్సిపాల్ మూర్తి, ఎన్. సీతారామయ్య పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు : మండల కేంద్రంలోని అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలు తహసిల్దార్ రఫీ జాన్, ఎంపీడీవో కె.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆశ్రమ పాఠశాలల్లో, ప్రాథమిక పాఠశాలల్లో, అంగన్వాడి కేంద్రాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ పాల్గొన్నారు.

పెదబయలు :స్థానిక రెసిడెన్సీయల్ పాఠశాలలో అల్లూరి చిత్ర పటానికి విద్యార్థులు నివాళి అర్పించారు. పదవ తరగతి విద్యార్థి సాయివర్ధన్ ఉపన్యాసం విద్యార్థులను ఆకట్టుకుంది. గిరిజన సంక్షేమ వసతి గృహల్లో ప్రధాన ఉపాధ్యాయులు, విద్యార్థులు జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

చింతపల్లి :

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతోత్సవాలను మన్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ కూడలిలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఏఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. తహసిల్దార్ రామకృష్ణ, తెదేపా, జనసేన నాయకులు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏఎస్‌పి మాట్లాడుతూ, అల్లూరి ఉద్యమ స్ఫూర్తిని ఈ ప్రాంతీయులు మరువ లేరన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిఐ రమేష్, పోలీసులు, తెదేపా జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతగిరి:మండల కేంద్రంలో బొడ్డచెట్టు కోలనీ గ్రామం వద్ద అంగన్వాడీ కార్యకర్త పి.సరస్వతి అధ్యక్షతన అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు, .సర్పంచ్ సోమెల రూతు మాట్లాడుతూ, అల్లూరి పోరాటం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో సీతమ్మ , బి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు

రంపచోడవరం : భారతదేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారిపై పోరాటం చేసిన విప్లవ వీరుడిని ఎప్పటికప్పుడు గుర్తుంచుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రంపచోడవరం ఐటిడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. గురువారం స్థానిక ఐటిడీఏ సమావేశ మందిరంలో అల్లూరి చిత్రపటానికి పిఓ పుష్పాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రతి ఏటా విప్లవ వీరుడు అల్లూరి జయంతి జరుపుకునే బాధ్యత మన అందరిపై ఉందని రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు చిన్నం బాబు రమేష్, సీతంశెట్టి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు మఠం విజయ భాస్కర్, బాపిరాజు, సురేష్ బాబు పాల్గొన్నారు.


చింతూరు : చింతూరు ఐటిడిఎ సమావేశ మందిరంలో చిత్ర పటానికి అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, చింతూరు ఐటిడిఎ పిఓ కావూరి చైతన్య తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుడు, విఆర్.పురం మండలం ప్రత్తిపాక గ్రామ నివాసి శ్యామల వెంకట రామయ్యను సన్మానించారు. కార్యక్రమంలో ఐటిడిఎలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ కె రత్న మాణిక్యం, కళాశాల సిబ్బంది అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ ఆసుపత్రి ఆవరణలో అల్లూరి చిత్ర పటానికి శ్రద్ధాంజలి ఘటించారు.

రాజవొమ్మంగి : మన్యం వీరుడు అల్లూరి మన్య పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకమని గిరిజన సంఘం మండల అధ్యక్షులు కుంజం జగన్నాథం, టిడిపి నాయకులు డి.శివరామచంద్రరాజు, రాజవమ్మంగి తహశీల్దారు డివి సత్యనారాయణ, సిఐ సన్యాసినాయుడు, ఎస్ఐ వెంకయ్య, ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు తదితరులు అన్నారు. అల్లూరి సీతారామరాజు దాడి చేసిన రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్లోనూ, స్థానిక తహశీల్దారు ఎంపీడీవో కార్యాలయాల్లోనూ, పలు ప్రభుత్వ పాఠశాలల్లోనూ అల్లూరికి ఘనంగా నివాళులర్పించారు. గిరిజన సంఘం నాయకులు కొండ్ల సూరిబాబు, డిటి ఏ సత్యనారాయణ పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మండలంలోని పోలీస్ స్టేషన్లో, తహశీల్దారు, ఎంపీడీవో కార్యాలయాలు, పలు ప్రభుత్వ పాఠశాలలో గురువారం అల్లూరికి ఘనంగా నివాళులర్పించారు. మారేడుమిల్లి పై సెంటర్‌లో ఉన్న అల్లూరి విగ్రహానికి ఆదివాసీ నాయకులు పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు గొర్లె చిన నారాయణ, అనుదీప్ కుమార్, పలువురు గిరిజన నాయకులు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు పోస్ట్ ఆఫీస్ సమీపంలో అల్లూరి విగ్రహానికి ఏపీ జెన్కో ఎస్ఈ ప్రశాంత్ కుమార్, ఈఈ రాజేంద్రప్రసాద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీలేరు ఎస్ఐ రామకృష్ణ, యూనియన్ నాయకులు, కార్మికులు, ఇంజనీర్లు, ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, సర్పంచ్ దుర్జో పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, సీలేరు సచివాలయం, దారకొండలోనూ అల్లూరికి శ్రద్ధాంజలి ఘటించారు.

అడ్డతీగల : అడ్డతీగల పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న అల్లూరి విగ్రహానికి అడ్డతీగల ఎస్సై అప్పలరాజు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో అల్లూరి యువజన సంఘం నాయకులు చోడిశెట్టి సుబ్బారావు, స్టార్ శ్రీను, టిడిపి, జనసేన నాయకులు బాలయోగి, బాలు, అక్కపెల్లి పండు, కృష్ణారెడ్డి, రాజేంద్ర పాల్గొన్నారు.


అడ్డతీగలలో అల్లూరికి నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

గిరిజనేతరుడిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న గంగరాజు

ప్రజాశక్తి అనంతగిరి : చట్టాలు, హక్కులను తుంగలో తొక్కి ఓ గిరిజన నేతరుడు ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బొర్రా గుహలు ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన జీప్ లైన్ రోప్ వే ను జడ్పిటిసి దీసరి గంగరాజు, టోకురు సర్పంచ్ కిల్లో మోస్య లు పరిశీలించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, చట్టాలను విరుద్ధంగా జిప్ లైన్ ఏర్పాటు చేసిన గిరిజనేతరుడిపై చట్ట పరమైన చర్యలను అధికారులు తీసుకోవాలని డిమాండ్ చేశారు స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. జిప్పు లైన్ లో 9 నెలుల పాటు వసూలైన నగదును రికవరి చేయాలని డిమాండ్ చేశారు

పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలి



డాక్టర్ గణేశ్వరరావు

ప్రజాశక్తి -అనంతగిరి:ప్రపంచ జూనోసిస్ దినోత్సవం లో భాగంగా ఈనెల 6న రాబిస్ వ్యాధి నిరోధక దినోత్సవం విజయవంతం చేయాలని కాశిపట్నం పశువైద్య శాఖ అధికారి సాగరి.గణేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పెంపుడు కుక్కలకు టీకాలు ఉచితంగా కాశీపట్నం, అనంతగిరి పశు వైద్య శాలలో అందుబాటులో ఉంచామన్నారు. మండలంలోని ఉన్న 24 రైతు సేవ కేంద్రాలలో పెంపుడు కుక్కలకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు.

మౌలిక సౌకర్యాల కల్పనకు తీర్మానం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని మండలంలోని ఖండ్రుమ్ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి స్థానిక సర్పంచ్ సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు కే.హరి, వార్డు సభ్యులు పూల దండలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన గ్రామసభలో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని పాలకవర్గం సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆనందరావు, మండల ఉపాధ్యక్షులు, పంచాయతీ కార్యదర్శి గోవింద్, ప్రతిమ, ఉప సర్పంచ్ కిముడు డోంబై పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకుందాం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:నిరుపేద బడుగు బలహీన వర్గాలకు పట్టుకొమ్మలుగా ఉన్న ప్రభుత్వ బడులను ప్రతి ఒక్కరు రక్షించుకోవాలని యుటిఎఫ్ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరావు పిలుపునిచ్చారు. మండలంలోని గుంటసీమ ఆశ్రమ పాఠశాలలో స్థానిక యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల బలపేతంతోనే సమాజం అభివృద్ధి ముడిపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే రాజారావు, శెట్టి బాలకృష్ణ, దుక్కు రాంబాబు పాల్గొన్నారు.

జూపార్కుకు చేరుకున్న కొత్త నేస్తాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు గుజరాత్, మోటి ఖవ్డి, జామ్నగర్‌లోని రాధేకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్టు మధ్య జరిగిన జంతు మార్పిడి ఒప్పందం ప్రకారం విశాఖ జూ పార్కుకు కొన్ని కొత్త జంతువులు, పక్షులను గురువారం మధ్యాహ్నం 3 గంటలకు తీసుకు వచ్చారు. రెండు జతల కామన్ మార్మోసెట్, స్కార్లెట్ మకావొ, మిలట్రీ మకావొ, గ్రీన్ విగ్డ్ మకావొ, మీడియం సల్ఫర్ కాక్టూ, స్క్వారెల్ మంకీ, స్లెండర్ టైల్డ్ మీర్కాట్, ఒక జత రెడ్ నెక్డ్ వాల్బే విశాఖ జూ పార్కుకు వచ్చాయి. ఇక్కడ నుంచి రెండు స్ట్రిప్డ్ హైనా, రెండు హాగ్ డీర్స్, గ్రీన్ పెలికాన్, పది జతల స్టార్ తాబేళ్ళు, ఒక ఘూరియల్, రెండు జంగిల్ క్యాట్, పది ధోల్స్, రెండు వూల్స్, రెండు గార్స్‌లను రాధేకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్టుకు తరలించారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి పర్యాటక ప్రాంతంలో నానాటికీ ప్లాస్టిక్ వినియోగం తీవ్రమైపోతుందని, దానిని అరికట్టాలని వనవాసీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు గొర్లె అనుదీప్ కుమార్ అన్నారు. మారేడుమిల్లి పర్యాటక ప్రాంతాల్లో సంస్థ ఆధ్వర్యాన ప్లాస్టిక్ బాటిళ్లను ఏరి గురువారం తగులబెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను అరికట్టాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందని, దీనిపై ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు. ప్లాస్టిక్ భూమిలో కలవడానికి చాలా సంవత్సరాలు పడుతుందని, దీనివల్ల భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, మూగజీవులు చనిపోతున్నాయని, అడవులు నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

గిరిజన మత్స్యకారులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-రంపచోడవరం : పందిరిమామిడి మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నేలకోట గిరిజన మత్స్యకార సంఘం సభ్యులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి డాక్టర్ పి.శ్రీనివాస్ యాజమాన్య పద్ధతులలో చేపల పెంపకం, సొసైటీల రికార్డుల నిర్వహణ, గోదావరి నదిలో చేపలు వేట చేసుకొనే గిరిజన మత్స్యకారులకు నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ శ్రీనివాస్‌ను, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సిహెచ్.రమేష్‌ను గిరిజన మత్స్యకారులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘాల సభ్యులు, విఎఫ్ఎలు కె.బాలాజీ. కె.సత్యవేణి, జే.సత్యవతి, డి.శివ సాయి పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన ప్రాజెక్టు డైరెక్టర్

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో నిమ్మలగూడెం అంగన్వాడీ కేంద్రాన్ని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యకుమారి గురువారం సందర్శించారు. ముందుగా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి పోరాటం గురించి విద్యార్థులకు తెలియజేశారు.

అనంతరం అంగనవాడీ పిల్లల ఆటపాటలు గురించి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలకు టిహెచ్‌ఆర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో చింతూరు సీడీపీఓ ప్రాజెక్టు ఆఫీసర్ పి.విజయ గౌరీ, పాడేరు సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్, సూపర్వైజర్ పి.సంఘమిత్ర, డి.ప్రియాంక, వి.సత్యవతి, బి.పార్వతి కె.రాధ, జూనియర్ అసిస్టెంట్ పి.రవి కుమార్, బిపిసి పైదా రాజయ్య పాల్గొన్నారు.

వివేకానంద వర్ధంతి సభ

విఆర్.పురం : వివేకానంద ప్రెస్‌క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో రేఖపల్లిలో గురువారం వివేకానంద వర్ధంతి సభ నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సభ్యులు వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు మసకపల్లి, సత్తిబాబు, డి.రామారావు, ఎ.నాగేంద్రబాబు, వల్లి సుందరం, బి.నాగేశ్వరరావు, గోలి వికాస్, ఎం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ సిబ్బందితో సమావేశం


ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని చీడిపాలెం రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి ఉమాదేవి వ్యవసాయ శాఖ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో వరి విత్తనాలను అర్హత కలిగిన రైతులందరికీ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. మట్టి నమూనా కూడా పరిశీలించడం జరిగిందన్నారు. ఈ క్రాప్ కూడా త్వరలోనే అధికారికంగా చేయాలని కోరారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీరు, డ్రైయినేజీ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అడ్డతీగల : మండల కేంద్రం అడ్డతీగల పంచాయతీ పరిధిలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో రంగారావుకు జనసేన, టిడిపి నాయకులు గురువారం విన్నవించారు. డ్రైనేజీ వ్యవస్థ, బోర్లు మరమ్మతులు చేయాలని కోరారు. దీనిపై ఎంపీడీవో రంగారావు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జర్త వెంకటరమణరెడ్డి, బీర బాలయోగి, కామన్ బుజ్జి, వరలక్ష్మి, బాపనమ్మ, భద్రం, జనసేన పార్టీ నాయకులు తాటికొండ రాజేంద్ర, చోళ కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైవిధ్యం విజయకృష్ణన్ పయనం

- నేడు అనకాపల్లి కలెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ
- క్షేత్రస్థాయి పరిశీలనకు అధిక ప్రాధాన్యత
- జనంతో మమేకం
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
'ప్రజాశక్తి'కి నూతన కలెక్టర్ పలు విషయాలు వెల్లడి


పిల్లలతో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

2013 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి ఆమె. క్షేత్రస్థాయిలో నిత్యం పర్యటించి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటారు. ప్రజల దగ్గరకు వెళ్తారు.. వారితో మమేకమవుతారు. వారి కష్టాలేంటో అడుగుతారు. పేదలకు రావాల్సిన పథకం ఫలితాలు వారి దరిచేరకపోతే సరిచేసేందుకు వెంటనే ఆదేశాలిస్తారు. కష్టమేంటో తెలుసుకుంటారు. పరిష్కారానికి మార్గం వెతుకుతారు. అధికారులతో సమన్వయంతో వ్యవహరిస్తారు. ఉద్దేశపూర్వకంగా తప్పులు చేస్తే మాత్రం కఠినంగా వ్యవహరిస్తారు. ఇలా.. విధి నిర్వహణలో ముక్కుసూటిగా, ప్రజలకు చేరువుగా వున్న ఆమె ఎవరోకాదు.. అనకాపల్లి జిల్లా ఆవిర్భావం తరువాత జిల్లాకు రెండో కలెక్టర్‌గా వస్తున్న విజయ కృష్ణన్. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు కలెక్టర్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలో 'ప్రజాశక్తి' పలకరించగా ఆమె పలు విషయాలు వెల్లడించారు.

విజయ కృష్ణన్ భర్త అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్. ఆ దంపతులకు అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. 2013 డిసెంబరు 9న విజయ కృష్ణన్ ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. తొలుత ఉమ్మడి అనంతపురం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. రాజమండ్రి సబ్ కలెక్టర్‌గా, కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, ఎపి టూరిజం అథారిటీ సిఇఒ, ఎఎంఆర్‌డిఎ అదనపు కమిషనర్‌గా, స్టాఫ్ ఆఫీస్ ఛీఫ్ సెక్రటరీగా, జిఎడిలో డిప్యూటీ సెక్రటరీగా, ఎఎంఆర్‌డిఎ కమిషనర్‌గా, సిఆర్‌డిఎ కమిషనర్‌గా, బాపట్ల కలెక్టర్‌గా, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా ఆమె పలు బాధ్యతలు నిర్వహించారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి స్థానంలో ఇప్పుడు అనకాపల్లి కలెక్టర్‌గా వస్తున్నారు.

ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా దినేష్‌కుమార్, బాపట్ల కలెక్టర్‌గా విజయ కృష్ణన్ పనిచేసినప్పుడు తమ పిల్లలతో కలిసి కూలీలతో పొలంలో వరినాట్లు వేసి, పొలం గట్టుపై భోజనం చేయడం వారి ప్రతిష్టను పెంచింది. దినేష్‌కుమార్ తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిగా పనిచేసిన కాలంలో విజయ కృష్ణన్ రాజమండ్రి సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. ఆ సమయంలో కార్పొరేట్ ఆస్పత్రిలో జాయిన్ కాకుండా, పేదలు వైద్యం చేసుకొనే ప్రభుత్వ ఆసుపత్రి పట్ల సాధారణ ప్రజలకు నమ్మకం, విశ్వాసం పెంపొందించేందుకు రంపచోడవరం ప్రభుత్వ ఆస్పత్రిలో విజయ కృష్ణన్ ప్రసవం చేసుకున్నారు. తనకున్న సమయంలో అధికభాగం ప్రజలతో కలిసి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇచ్చే స్వభావం ఆమెది.

ఇక అనకాపల్లి జిల్లా విషయానికొస్తే.. వ్యవసాయాధారిత గ్రామీణ ప్రాంతమిది. తక్కువ నీటి వనరులున్న జిల్లా. వరి, చెరుకు సాగే ప్రధానం. ఇక తీర ప్రాంత విషయానికొస్తే.. నక్కపల్లి, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల్లో ఔషధ పరిశ్రమలు, అచ్యుతాపురం సెజ్‌లో వివిధ రకాల పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో నిరంతరం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పరిశ్రమల్లో కాలుష్య ప్రమాణాలు పాటించకపోవడంతో కాలుష్య ప్రభావిత సమస్యలతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. విశాఖ - చెన్నయ్ కారిడార్, ఎన్ఎఒబి నిర్వాసితులకు జిల్లాలో పూర్తిస్థాయిలో పరిహారం, పునరావాసం లభించలేదు. నాన్ షెడ్యూల్ గిరిజన ప్రాంతంలో కనీస సౌకర్యాల్లేక గిరిజనులు అవస్థలుపడుతున్నారు. జిల్లా కేంద్రం అనకాపల్లి పట్టణంలో మురుగునీటి కాలువలు సరిగాలేక కొన్ని దశాబ్దాలుగా పరిష్కారంకాని సమస్యగా దోమల బాధ మిగిలిపోయింది. ప్రాధాన్యతా క్రమంలో నిర్ధిష్ట కాలపరిమితిలో సమస్యలను పరిష్కరించడానికి నూతన కలెక్టర్ చొరవ చూపుతారన్న ఆశ జిల్లా ప్రజల్లో వుంది. ఈ క్రమంలో 'ప్రజాశక్తి'తో నూతన కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయి పర్యటనలకు అధిక ప్రాధాన్యతనిచ్చి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

పార్వతీనగర్‌ను సందర్శించిన అధికారులు

ప్రజాశక్తి-సీలేరు

జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు జికె.వీధి తహశీల్దారు ప్రసాదరావు, ఏపీ జెన్కో ఎస్ఇ చంద్రశేఖర్ రెడ్డి గురువారం జికె.వీధి మండలం సీలేరు పంచాయతీ పరిధి పార్వతీనగర్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి వారి వారి స్థితిగతులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీలేరులో నూతనంగా నెలకొల్పుతున్న 1350 మెగావాట్ల పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణం నేపథ్యంలో పార్వతీనగర్ పివిటిజీలను అక్కడ నుండి ఖాళీ చేయాలని ఎపి జోన్‌కో అధికారులు నోటీసులు ఇచ్చారు. తమకు ప్రత్యామ్నాయంగా కుటుంబానికి ఒక ఇల్లు, ఇంటికొక ఉద్యోగం ఇస్తేనే ఖాళీ చేస్తామని పివిటిజిలు అధికారులకు స్పష్టం చేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో అల్లూరు జిల్లా కలెక్టర్ బుధవారం సీలేరులో పర్యటించిన సందర్భంగా పార్వతీనగర్ పివిటిజి గిరిజనులు తమ సమస్యలపై కలెక్టర్‌కు విన్నవించారు. దీనికి స్పందించిన కలెక్టర్ దినేష్ కుమార్ గ్రామాన్ని స్వయంగా సందర్శించి సమస్యలు తెలుసుకొని నివేదిక పంపాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జీకే వీధి మండల తహశీల్దారు ప్రసాదరావు, పంపు స్టోరేజ్ ప్రాజెక్టు ఎస్ఇ చంద్రశేఖర్ రెడ్డి పార్వతీనగర్ గ్రామాన్ని సందర్శించారు.

ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ దుప్పిలివాడ పంచాయతీ పరిధి బూసి కొండలో గతంలో పార్వతీనగర్ పివిటిజిలకు ఇల్లు నిర్మాణం కోసం ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందని, ఆ ప్రదేశాన్ని సందర్శించి స్థల పరిశీలన చేశామని చెప్పారు. అయితే వారి కేటాయించిన ఇల్లు స్థలాలు వేరొకవని తమ పరిశీలనలో వెల్లడైందన్నారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూసేందుకు ఏపీ జెన్కో అధికారులతో సంప్రదింపులు చేసి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో స్వరూపు, సర్పంచి దుర్జు గ్రామస్తులు పాల్గొన్నారు.

స్తంభం నేలకూలి నిలిచిన విద్యుత్ సరఫరా

- నాలుగు రోజులైనా పట్టించుకోని అధికారులు


వర్షాలకు నేలకొరిగిన స్తంభం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధి మనసలవీధిలో నాలుగు రోజుల క్రితం భారీ వర్షాలకు విద్యుత్ స్తంభం కూలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్తంభం కూలిపోయి నాలుగు రోజులు గడుస్తున్నా పునరుద్ధరణకు ట్రాన్స్‌కో అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. లైన్‌మ్యాన్‌కి సమాచారం అందిస్తే రేపో మాపో తొలగిస్తామంటూ కాలయాపన చేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కటిక చీకట్లో కాలం వెలదీస్తున్నామని, అధికారులకు తెలియజేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దట్టమైన ప్రాంతంలో రాత్రివేళ చిన్నపిల్లలతో బిక్కుబిక్కుమంటూ నిద్రించే సమయంలో విష కీటకాల వలన ప్రమాదం సంభవిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ షాక్ గురై ఎవరైనా ప్రమాదాన్ని గురైతే దానికి ట్రాన్స్‌కో అధికారుల పూర్తి బాధ్యత వహించాలని వారు హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి కూలిపోయిన విద్యుత్ స్తంభాన్ని పునరుద్ధరించి తమ గ్రామానికి విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.